## ఐదవ ప్రకరణం

# తౌహీదె రుబూబియత్ – తౌహీదె ఉలూహియత్ పరస్పరం విడదీయరానివి

దీని భావం ఏమిటంటే అల్లాహ్‌ను సృష్టికర్తగా, ప్రభువుగా, పోషకునిగా, ప్రణాళికా రచయితగా, నిర్వహణకర్తగా అంగీకరించిన వ్యక్తి అన్ని రకాల ఆరాధనలకు అల్లాహ్ ఒక్కడే హక్కుదారుడన్న విషయాన్ని కూడా అంగీకరించి తీరాలి. ఇదే తౌహీదె ఉలూహియత్. ఎందుకంటే ఉలూహియతే ఆరాధనకు నామాంతరం. 'ఇలాహ్' అంటే దైవం అని అర్థం. కనుక కేవలం అల్లాహ్‌నే మొరపెట్టుకోవాలి. ఆయన్నే అభ్యర్థించుకోవాలి. ఆయనపైనే భరోసా చేయాలి. ఆయన్నే నమ్ముకోవాలి. ఆరాధనలు, ఉపాసనలు ఆయనకే ప్రత్యేకించుకోవాలి. ఆయన పేరునే మొక్కుకోవాలి. అన్ని రకాల ఆరాధనలు ఆయన కోసరమే నెరవేర్చాలి. ఆ విధంగా తౌహీదె రుబూబియత్ తౌహీదె ఉలూహియత్ అనివార్యతకు ప్రబల తార్కాణం. అందుకే అల్లాహ్ తౌహీదె ఉలూహియత్ (దైవత్వంలో ఏకత్వం) ను తిరస్కరించే వారిని, వారు తౌహీదె రుబూబియత్‌ను అంగీకరించిన సంగతి పదే పదే పునరావృతం చేస్తూ ప్రశ్నించాడు. ఉదాహరణకు : ఒకచోట అల్లాహ్ ఇలా ప్రశ్నిస్తున్నాడు–

﴿يَا أَيُّهَا النَّاسُ اعْبُدُوا رَبَّكُمُ الَّذِي خَلَقَكُمْ وَالَّذِينَ مِن قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُونَ ۝ الَّذِي جَعَلَ لَكُمُ الْأَرْضَ فِرَاشًا وَالسَّمَاءَ بِنَاءً وَأَنزَلَ مِنَ السَّمَاءِ مَاءً فَأَخْرَجَ بِهِ مِنَ الثَّمَرَاتِ رِزْقًا لَّكُمْ فَلَا تَجْعَلُوا لِلَّهِ أَندَادًا وَأَنتُمْ تَعْلَمُونَ﴾ (البقرة:٢١،٢٢)

**"ప్రజలారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువునే ఆరాధించండి – తద్వారానే మీరు (పాపాల నుండి) సురక్షితంగా ఉంటారు. ఆయనే మీ కోసం భూమిని పాన్పుగానూ, ఆకాశాన్ని కప్పుగానూ చేశాడు. ఆకాశం నుండి వర్షాన్ని కురిపించి, తద్వారా పండ్లు ఫలాలను పండించి మీకు ఉపాధి నొసగాడు. ఇది తెలిసికూడా మీరు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టకండి."**

**(అల్ బఖర : 21, 22)**

ఈ దివ్య సూక్తిలో అల్లాహ్ తౌహీదె ఉలూహియత్ గురించి, అంటే తనను ఆరాధించమని ఆజ్ఞాపించాడు. తౌహీదె రుబూబియత్ ద్వారా (తాను చేసిన మేళ్ళను జ్ఞాపకం చేసి) మరీ చెప్పాడు. అంటే పూర్వీకులను, తరువాయి వారిని సృష్టించటం, భూమ్యాకాశాల మధ్య ఉన్న వస్తువులను సృష్టించటం, గాలులను నియంత్రించటం, వర్షాలు కురిపించటం, మొక్కలను మొలకెత్తించటం, పండ్లు ఫలాలను పండించి దాసులకు జీవనోపాధిని సమకూర్చటం వంటి వాటన్నింటినీ ప్రస్తావించి తన పోషకత్వం ఎటువంటిదో విశదీకరించాడు. వారి జీవిక కోసం ఇన్ని ఏర్పాట్లు చేసిన అల్లాహ్ దైవత్వంలో

https://teluguislam.net

వేరొకరికి సహవర్తుల్ని కల్పించటం దాసులకు ఎంతమాత్రం శోభించదు. ఎవరెవరి గురించి వారికి తెలుసో, వారిలో ఏ ఒక్కరూ ఈ పనులు చేయలేరన్న విషయం వారికి తెలుసు. కనుక దైవత్వంలో ఏకత్వపు విషయాన్ని రుజువు చేయటానికి నిజ దైవం యొక్క నిర్వహణా సామర్థ్యాన్ని విశదీకరించి, దానిని నిదర్శనంగా చూపాలి. ఎందుకంటే మనిషి అన్నిటికన్నా ముందు సృష్టికి మూలాధారాన్ని, లాభనష్టాల సరోవరాన్ని పరికిస్తాడు. తరువాత తనకు చేరువ అయ్యే, తనను సంతోషపరిచే, తనతో సంబంధం ఏర్పరచుకునే సాధనాలపై దృష్టిని కేంద్రీకరిస్తాడు. కాబట్టి తౌహీదె రుబూబియత్ తౌహీదె ఉలూహియత్‌కు ద్వారం వంటిది. అందుకే అల్లాహ్ ముష్రిక్కుల మేధోమధనం కోసం ఈ పద్ధతినే అవలంబించాడు. ఈ పద్ధతి ద్వారానే విషయాన్ని విడమరచి చెప్పమని తన ప్రవక్తలను ఆదేశించాడు. ఈ విధంగా సెలవిస్తున్నాడు :

﴿قُل لِّمَنِ الْأَرْضُ وَمَن فِيهَا إِن كُنتُمْ تَعْلَمُونَ ☆ سَيَقُولُونَ لِلَّهِ قُلْ أَفَلَا تَذَكَّرُونَ ☆ قُلْ مَن رَّبُّ السَّمَاوَاتِ السَّبْعِ وَرَبُّ الْعَرْشِ الْعَظِيمِ ☆ سَيَقُولُونَ لِلَّهِ قُلْ أَفَلَا تَتَّقُونَ ☆ قُلْ مَن بِيَدِهِ مَلَكُوتُ كُلِّ شَيْءٍ وَهُوَ يُجِيرُ وَلَا يُجَارُ عَلَيْهِ إِن كُنتُمْ تَعْلَمُونَ ☆ سَيَقُولُونَ لِلَّهِ قُلْ فَأَنَّىٰ تُسْحَرُونَ﴾ (المؤمنون:٨٤-٨٩)

**"భూమి మరియు అందులో ఉన్న సమస్త వస్తువులు ఎవరివో మీకే గనక తెలిసి ఉంటే చెప్పండి?" అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు. "సప్తాకాశాలకు, మహోన్నతమయిన (అర్ష్) పీఠానికి అధిపతి ఎవరు?" అని వారిని ప్రశ్నించు. 'అల్లాహ్‌యే' అని వారు జవాబిస్తారు. "మరలాంటప్పుడు మీరెందుకు భయపడరు?" అని వారిని అడుగు. "సమస్త విషయాల సార్వభౌమత్వం ఎవరి చేతుల్లో ఉందో, శరణు ఇచ్చేవాడెవడో, ఎవరికి వ్యతిరేకంగా ఏ శరణూ లభించదో – ఆయనెవరో మీకు తెలిసి ఉంటే చెప్పండి?" అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు. 'అల్లాహ్‌యే' అని వారు చెబుతారు. "మరైతే మీరు ఎలా మోసపోతున్నారు?" అని వారిని అడుగు. (అల్ మోమినూన్ :84- 89)**

అల్లాహ్ ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿ذَٰلِكُمُ اللَّهُ رَبُّكُمْ لَا إِلَٰهَ إِلَّا هُوَ خَالِقُ كُلِّ شَيْءٍ فَاعْبُدُوهُ﴾ (الأنعام:١٠٢)

**"ఆయనే అల్లాహ్. మీ ప్రభువు. ఆయన తప్ప మరొకరెవరూ ఆరాధ్యులు కారు. సమస్త వస్తువులను సృష్టించినవాడు ఆయనే. కాబట్టి మీరు ఆయన్నే ఆరాధించండి." (అల్ అన్ ఆమ్ : 102)**

పై సూక్తిలో అల్లాహ్ సృష్టిప్రక్రియలో, నిర్వహణలో తన విలక్షణతను, వైయక్తికతను చాటిచెబుతూ ఆరాధనకు తనే అర్హుణ్ణి అని స్పష్టం చేశాడు. మరోవిధంగా చెప్పాలంటే

అల్లాహ్ సమస్త ప్రాణులను సృష్టించటంలోని ప్రధాన ఉద్దేశం దైవారాధనే! దైవత్వంలో ఏకత్వాన్ని నమ్మి నడుచుకోవటమే! అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنسَ إِلَّا لِيَعْبُدُونِ﴾ (الذاريات:٥٦)

**"నేను జిన్నాతులను, మానవులను సృష్టించినది కేవలం నా దాస్యం (ఆరాధన) కొరకు తప్ప మరి దేనికొరకూ కాదు."(అజ్జారియాత్- 56)**

"నా దాస్యం కొరకు" అంటే భావం, వారు నన్నొక్కడినే ఆరాధనకు తగినవానిగా భావించాలి.

కేవలం దేవుని పోషకత్వాన్ని, నిర్వహణా సామర్థ్యాన్ని అంగీకరించినంత మాత్రాన మనిషి ఏకేశ్వరోపాసి కాజాలడు. అతను తౌహీదె ఉలూహియత్ (దైవత్వంలో ఏకత్వాన్ని) కూడా ఒప్పుకుని, తదనుగుణంగా మసలుకున్నప్పుడే అతని ఏకేశ్వరోపాసనకు సార్థకత చేకూరుతుంది. ఎందుకంటే దేవుని పాలనా దక్షతను, పనితనాన్ని బహుదైవారాధకులు కూడా అంగీకరిస్తారు. వేనోళ్ళా కొనియాడతారు. కాని ఈ ఒప్పుకోలు, ఈ ప్రశంసలు వారిని ఇస్లాం పరిధిలో చేర్చలేదు. అలాంటి వారితో అంతిమ దైవప్రవక్త (ﷺ) పోరాటం చేయవలసి వచ్చింది. మరి చూడబోతే అల్లాహ్‌యే ఉపాధి ప్రదాత అని, జీవన్మరణాల ప్రదాత అని అరబ్బు ముష్రికులు అంగీకరించేవారు. అల్లాహ్ సెలవిచ్చినట్లు–

﴿وَلَئِن سَأَلْتَهُم مَّنْ خَلَقَهُمْ لَيَقُولُنَّ اللَّهُ﴾ (الزخرف:٨٧)

**"మిమ్మల్ని పుట్టించినదెవరు?" అని నీవు గనక వారిని అడిగితే 'అల్లాహ్' అని వారు తప్పకుండా అంటారు. (అజ్ జుఖ్రుఫ్ : 87)**

﴿وَلَئِن سَأَلْتَهُم مَّنْ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ لَيَقُولُنَّ خَلَقَهُنَّ الْعَزِيزُ الْعَلِيمُ﴾ (الزخرف:٩)

**"భూమ్యాకాశాలను సృష్టించినదెవరు?" అని నీవు గనక వారిని ప్రశ్నిస్తే, 'సర్వశక్తుడు, సర్వజ్ఞాని అయినవాడే (అల్లాహ్‌యే)' అని వారు తప్పక సమాధానమిస్తారు. (అజ్ జుఖ్రుఫ్ : 9)**

﴿قُلْ مَن يَرْزُقُكُم مِّنَ السَّمَاءِ وَالْأَرْضِ أَمَّن يَمْلِكُ السَّمْعَ وَالْأَبْصَارَ وَمَن يُخْرِجُ الْحَيَّ
مِنَ الْمَيِّتِ وَيُخْرِجُ الْمَيِّتَ مِنَ الْحَيِّ وَمَن يُدَبِّرُ الْأَمْرَ فَسَيَقُولُونَ اللَّهُ﴾ (يونس:٣١)

**"ఆకాశం నుండి, భూమి నుండి మీకు ఉపాధిని సమకూర్చేవాడెవడు? చెవులపై, కళ్ళపై పూర్తి అధికారం కలవాడెవరు? ప్రాణమున్న దానిని ప్రాణము లేని దాని నుండి, ప్రాణములేని దానిని ప్రాణమున్న దాని నుండీ వెలికి తీసేవాడెవడు? సమస్త కార్యాల నిర్వహణ కర్త ఎవరు?" అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు. 'అల్లాహ్‌యే' అని వారు తప్పకుండా చెబుతారు. (యూనుస్ : 31)**

https://teluguislam.net

ఈ అంశానికి సంబంధించిన సూక్తులు దివ్య ఖుర్‌ఆన్‌లో ఇంకా ఎన్నో ఉన్నాయి. కనుక ఎవరయినా కేవలం అల్లాహ్ ఉనికిని అంగీకరిస్తే లేదా అల్లాహ్‌ను సృష్టికర్తగా, అధికారిగా ఒప్పుకుని అంతటితో సరిపెట్టుకుంటే అతనికి తౌహీద్ (దేవుని ఏకత్వం) యొక్క వాస్తవికత అర్థం కాలేదని అనుకోవాలి. దైవప్రవక్తలు దేని వైపునకు పిలుపు ఇచ్చారో, దానిని అతను గ్రహించలేదన్నమాట! అతను అవశ్యమైన దానిని వదలి అనుబంధమైన దానిని మాత్రమే ఆశ్రయించాడు. సూచించిన వానిని వదిలేసి సూచనతోనే సరిపెట్టుకున్నాడు.

దైవత్వంలోని విశిష్ఠత ఏమిటంటే అన్ని రకాల ఆరాధనలు, ఉపాసనలు కేవలం నిజ దైవానికే ప్రత్యేకించబడాలి. ఉదాహరణకు – భక్తీశ్రద్ధలు, అశక్తత, అణకువ, ప్రార్థన (దుఆ) ఆశ, రుజువర్తన, భరోసా (నమ్మకం, భారం మోపటం), ప్రేమ, దీనావస్థ, నిస్సహాయస్థితి మొదలగు వాటన్నింటిని షరీయతుపరంగానూ, హేతువుపరంగానూ, స్వాభావికంగానూ ఒక్కడైన అల్లాహ్‌కే తప్పనిసరిగా ప్రత్యేకం చేసుకోవాలి. ఈ ఆరాధనలు దైవేతరుల కొరకు నిషిద్ధమని నిర్ధారించుకోవాలి.